క్లుప్తంగా

మత్స్యకారుల అభివృద్ధికి కృషి



చెరువులో చేపపిల్లలను విడుదల చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్, ప్రజాప్రతినిధులు

సిర్పూర్(టి): రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తోందని జెడ్పీవైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు పేర్కొన్నారు. స్థానిక నాగమ్మ చెరువులో జెడ్పీవైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావ్ గురువారం చేప పిల్లలను విడుదల చేశారు. మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఎంపిటిసి సభ్యుడు సోహెల్ అహ్మద్, నాయకులు బామినే పోశం, సోగల రమేశ్, అఖిల్ అహ్మద్, ఇఫాత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులు క్రమశిక్షణతో పనిచేయాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ఉద్యోగులందరూ క్రమశిక్షణతో పని చేసి సంస్థ ఉన్నతి కోసం కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ అన్నారు. 11వ వేజ్‌బోర్డుకు సంబంధించి ఏరియర్స్ చెక్కులను గురువారం గోలేటి డిస్పెన్సరీ, ఖైరిగూడ ఓసీపీలో ఉద్యోగులకు అందజేశారు. ఏరియాలో అత్యధికంగా ఏరియర్స్ పొందిన వారిలో డైటీషియన్ ఎస్.విజయలక్ష్మి, స్టాఫ్‌నర్స్ జె.నాగ హైమవతి, హెడ్ ఓవర్‌మెన్ శీలం నాగేశ్వర్‌రావు ఉన్నారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, డీవైసీఎంవో ఆర్ శౌరి, పీవో ఉమాకాంత్, పీఈ వీరన్న, ఖైరిగూడ మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు, బీఎంఎస్ నాయకులు పేరం శ్రీనివాస్, డీవైపీఎం తిరుపతి పాల్గొన్నారు.

కలప పట్టివేత

వాంకిడి: అక్రమంగా తరలించేందుకు అటవీ ప్రాంతంలో సిద్ధంగా ఉంచిన కలపను గురువారం పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో అప్పలకొండ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహారాష్ట్ర అటవీ ప్రాంతం నుంచి నరికిన కలప దుంగలు సరిహద్దు ప్రాంతంలోని గోయేగాం అటవీ ప్రాంతంలో వేర్వేరు చోట్ల కొందరు అక్రమార్కులు దాచిపెట్టినట్లు సమాచారంతో తనిఖీ చేపట్టారు. 32 కలప దుంగలు పట్టుబడగా, వీటి విలువ రూ.72,539 ఉంటుందని పేర్కొన్నారు. తనిఖీల్లో ఎఫ్ఎస్‌వో సత్యనారాయణ, ఎఫ్‌బీవో కామరాజు పాల్గొన్నారు.

వారసంతలో సౌకర్యాలు కల్పించాలి



బురదగా మారిన వారసంత ప్రదేశాన్ని పరిశీలిస్తున్న దుర్గం రవీందర్

రెబ్బెన: గోలేటి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారసంతలో సౌకర్యాలు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్ డిమాండ్ చేశారు. గురువారం వారసంత నిర్వహించే ప్రదేశాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వారసంత ప్రదేశం బురదగా మారి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారసంతకు వచ్చే మహిళలు, ప్రజలు, వర్తక వ్యాపారులు అవస్థలు పడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు కస్తూరి రవికుమార్ ఉన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

తిర్యాణి: కోరం లేక మండల సర్వసభ్య సమావేశాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో సత్యనారయణసింగ్ గురువారం ప్రకటించారు. వచ్చే నెలలో తిరిగి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. కాగా, ఎంపీటీసీ సార రమేశ్‌గౌడ్ సాక్షితో మాట్లాడుతూ సభకు పూర్తిస్థాయిలో అధికారులు హాజరు కావడం లేదన్నారు. వచ్చిన కొందరు అధికారులు సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. మండల పరిషత్‌కు వచ్చిన నిధులను గౌరవ సభ్యులకు తెలియకుండానే అధికారులు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు.

అనారోగ్యంతో కార్మికుడి మృతి

కౌటాల: మండలంలోని కనికి గ్రామ పంచాయతీ కార్మికుడు ఇప్ప భీమయ్య(58) అనారోగ్యంతో గురువారం సాయంత్రం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు..భీమయ్య గత 17 ఏళ్లుగా గ్రామ పంచాయతీలో కామటిగా విధులు నిర్వహిస్తున్నాడు. గత కొన్నిరోజుల నుంచి భీమయ్య కిడ్నీ సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. ఆసుపత్రుల్లో చికిత్స అందించినా కోలుకోలేదు. ఈ క్రమంలో ఇంటి వద్ద ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు.

వర్ష బీభత్సం

- ఉధృతంగా ప్రవహించిన వాగులు
- రాకపోకలకు అంతరాయం
- ఇళ్లలోకి చేరిన నీరు
- స్థానికుల ఇక్కట్లు



ఉధృతంగా ప్రవహిస్తున్న దిందా వాగు

చింతలమానెపల్లి: మండలంలో గురువారం వర్షం బీభత్సం సృష్టించింది. ఏకధాటిగా కురిసిన వానకు జనజీవనం స్తంభించింది. దిందా, శివపెల్లి, బూరెపెల్లి, రణవెల్లి గ్రామాల మధ్య వాగులు ఉధృతంగా ప్రవహించాయి. దిందా వాగుపై లోలెవల్ వంతెనపై నుంచి వరద ప్రవహించడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఇరువైపులా రాకపోకలు చేయలేని పరిస్థితి కారణంగా విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులకు గురయ్యారు. ఉపాధ్యాయులు చేరుకోకపోవడంతో దిందాలోని పాఠశాల తెరుచుకోలేదు. మండల కేంద్రంలో ప్రధాన రహదారి ఇటీవల నూతనంగా నిర్మించారు. డ్రెయినేజీలు లేని కారణంగా నీరు ఇళ్లలోకి, పలువురి దుకాణాల్లోకి నీరు చేరడంతో సామాన్లు తడిసిపోయాయి. ఇళ్లలో వరదనీరు రావడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. స్థానికులు మోటార్లు ఏర్పాటు చేసుకుని నీటిని బయటకు పంపించారు. చింతలపాటి వద్ద వాగు వరద ఉధృతితో కౌటాల నుంచి చింతలమానెపల్లి మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి.

సిర్పూర్(టి): ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. సిర్పూర్(టి)–కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలోని చెట్లు విరిగిపడ్డాయి. వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. పెద్దబండ-వేంపల్లి గ్రామాల మధ్యలో భీమన్న ఆలయం ఎదురుగా చెట్లు విరిగి పడిపోవడంతో ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అదే సమయంలో సిర్పూర్(టి) నుంచి కాగజ్‌నగర్ వైపు వెళ్తున్న జేసీబీ ద్వారా చెట్లను తొలగించడంతో రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. పెద్దవాగు, ఉచ్చమల్లవాగు, బొక్కివాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బొంబాయిగూడ, ఎర్రగుట్ట గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.



చింతలపాటి వద్ద నిలిచిన రాకపోకలు



కూలిన వీరవెల్లి పంచాయతీ భవనం

దహెగాం: మండలంలో భారీ వర్షం కురిసింది. కోత్మీర్ గ్రామంలో ఇగరపు ఇంద్రసేన్ ఇంటి ఆవరణలో చెట్టు బాత్రూంపై పడి కూలిపోయింది.

కౌటాల: తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహితలో వరద నీరు పెరిగింది. ఈజ్‌గాం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బ్రేక్‌డౌన్ కావడంతో 10 గంటల పాటు కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది

కూలిన జీపీ భవనం

భారీ వర్షానికి శిథిలావస్థకు చేరిన వీరవెల్లి పంచాయతీ భవనం కూలిపోయింది. స్థానిక ప్రాథమిక పాఠశాల పాత భవనంలో పంచాయతీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. భారీ వానకు భవనం వెనక గోడతోపాటు స్లాబ్ కూలిపోయింది. జీపీ కార్యాలయంలోని బీరువా, కుర్చీలు, టేబుల్, ఫైబర్ సిస్టం ధ్వంసమైనట్లు సర్పంచ్ ద్రౌపతి తెలిపారు. ఇదే భవనంలో అంగన్‌వాడీ కొనసాగుతుండడంతో బియ్యం, కోడిగుడ్లు, పప్పు, పౌష్టికాహారం సరుకులు ధ్వంసమయ్యాయి. భవనం కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.



చింతలమానెపల్లి: ఇళ్లలోకి చేరిన నీరు



సిర్పూర్(టి)-కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలో విరిగిపడ్డ చెట్లను తొలగిస్తున్న జేసీబీ



బొంబాయిగూడ ఎర్రగుట్ట గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న ఉచ్చమల్లవాగు



కోత్మీర్‌లో కూలిన బాత్రూం

వైద్యకళాశాలకు 'కొండా' పేరు పెట్టాలి

- పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు
- ఘనంగా కొండా లక్ష్మణ్ వర్ధంతి



ఆసిఫాబాద్: నివాళులర్పిస్తున్న నాయకులు



రెబ్బెన: నివాళులర్పిస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ వైద్య కళాశాలకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు అన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మశాలి సంఘం భవనంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. సంఘం ప్రతినిధులు బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండి చౌరస్తాలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటు చేయాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. మాజీ ఆప్కో చైర్మన్ జగన్నాథం, సంఘం నాయకులు లింగయ్య, ధర్మయ్య, భవన రుషి, తేలివార్ మోహన్, శ్రీకాంత్, సంజీవ్, ప్రవీణ్, మధుకర్, శైలేందర్, శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రణయ్, వేణుగోపాల్, మంగ, పుష్పలత, సునీత, విజయ పాల్గొన్నారు.

రెబ్బెన: పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గోలేటి టౌన్‌షిప్‌లో కొండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, గోలేటి పట్టణ అధ్యక్షుడు వీరస్వామి, సంఘం నాయకులు చందర్, సమ్మయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, రాజశేఖర్, శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.



బెజ్జూర్: నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

బెజ్జూర్: మండల కేంద్రంలో పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో కొండా వర్ధంతిని నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి కసుకుట్ల వెంకటేశ్, సభ్యులు పర్శ గణేశ్, రమేశ్, శ్రీనివాస్, శ్రీకాంత్, శంకర్, శేఖర్, సతీశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

తిర్యాణి: మండల కేంద్రంలో కొండా వర్ధంతిని నిర్వహించారు. జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హన్మండ్ల జగదీశ్, నాయకులు గాయంగి రాజయ్య, శంకరయ్య, గాయంగి తిరుపతి ఉన్నారు.

గ్రామాల స్వచ్ఛతే లక్ష్యంగా..

- స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు
- కొనసాగుతున్న పనులు
- రోజు వందమందితో శ్రమదానం

కెరమెరి: గ్రామాల స్వచ్ఛతే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా 'స్వచ్ఛతా హీ సేవా 'పక్షోత్సవం పేరిట కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. కలెక్టర్ హేమంత బోర్కడే ఆదేశాలతో ఈ కార్యక్రమాలు ఈనెల 17 నుంచి ప్రారంభం కాగా, 23కు ముగియనున్నాయి. మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలో ఒక్కో పంచాయతీలో 100 మందితో శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణమైన పండుగలపై యువత, మహిళా సంఘాలతో చర్చావేదికలు నిర్వహించి అవగాహన కల్పించారు. విద్యార్థులతో మానవహారం, ప్రతిజ్ఞ, ర్యాలీలు, చేపట్టారు. స్వచ్ఛతా మిత్రులను గుర్తించి వారికి సన్మానాలు చేశారు. అలాగే చెత్త నుంచి వస్తువులను వేరు చేయడం, వ్యర్థాల నిర్వహణ, పంచాయతీ ఆస్తుల మరమ్మతు, పెయింటింగ్‌తో అలంకరణ, డంపింగ్ యార్డులు, ఇంకుడు గుంతల సరైన విధంగా నిర్వహణ, పంచాయతీ స్థాయిలో విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్, ఉపన్యాస, వ్యాస రచన, యువతకు చిత్రలేఖనం, క్విజ్, పాటలు, క్రీడాపోటీలు, మహిళలు రంగోలి తదితర పోటీలు నిర్వహించారు.

నేడు, రేపు..

నేడు(22న) డ్రైడే, ఫ్రైడేలో భాగంగా గ్రామాల్లో నిలిచి ఉన్న మురుగునీటిని తొలగించడం, టబ్బులు, టైర్లు, డ్రమ్ముల్లో నిల్వ నీటిని తొలగించడం, డ్రెయినేజీలు శుభ్రం చేయడం, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడం, ఈగలు దోమలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం, స్వచ్ఛ కుటుంబాలు, పౌరులు, సంస్థలను గుర్తించి వారిని సన్మానిస్తారు. 23న ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో శ్రమదానం, గ్రామాల్లో చెత్త వేసే ప్రదేశాలను గుర్తించి తొలగించడం, స్వచ్ఛతా కార్యక్రమాలపై కళాజాత ద్వారా ప్రజలకు నిర్వహిస్తారు.



ఝరిలో శ్రమదానంతో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న అధికారులు, ప్రజలు

పకడ్బందీగా నిర్వహిస్తున్నాం



గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాలతో ప్రతీరోజు కార్యక్రమాలు చేపడుతున్నాం. గ్రామాలను స్వచ్ఛతగా తీర్చిద్దిడంతోపాటు అనేక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– మహేందర్, ఎంపీడీవో, కెరమెరి

కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు జీవో 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎం రవిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు బోనస్‌ను 20 శాతానికి పెంచాలన్నారు. కుటుంబ సభ్యులకు సింగరేణి హాస్పిటల్‌లో ఉచిత వైద్య సదుపాయం, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. నర్సరీ కార్మికులకు కనీస వేతనాలు, ఈపీఎఫ్ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు ఉచిత మెడికల్, యూనిఫాం అంశాన్ని పరిష్కరించాలన్నారు. కాంట్రాక్టు కార్మికుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి అశోక్, సీపీఐ పట్టణ కార్యదర్శి మారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

బాధిత కుటుంబాలకు పరామర్శ

దహెగాం: అనారోగ్యంతో మృతి చెందిన పలు కుటుంబాలను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గురువారం పరామర్శించారు. మండలంలోని గిరవెల్లికి చెందిన రైతు నవీన్ బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థికసాయం అందించారు. అదే విధంగా ఏటిగూడకు చెందిన సాయి సాకేత్ ఇటీవల ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం వికటించి మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. కమ్మర్‌పల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ముడిమడుగుల దాసు అనారోగ్యంతో మృతి చెందగా, కుటుంబీకులను ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ సంతోష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, సర్పంచులు కారు రాజన్న, రమేశ్, పెంచికల్‌పేట్ మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, పెంచికల్‌పేట్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, నాయకులు తుమ్మిడె మల్లేశ్, అంజన్న, నాగేష్, జాజిమొగ్గల శ్రీనివాస్ ఉన్నారు.



గిరవెల్లిలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

లంబోదరుడికి పూజలు



బాపూనగర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కౌటాల కౌండిన్య గణేశ్ మండలి మండపంలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బాపూనగర్‌లోని శారదాగణేశ్ మండలి ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని రాజూరాలో మట్టితో తయారు చేసిన గణనాథుడిని ప్రతిష్టించారు. మంటపం వద్ద భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం వెరైటీ పూలదండలతో వినాయకుడిని అలంకరించారు.

రెబ్బెన: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామ గ్రామాన ప్రతిష్టించిన లంబోదరుడికి భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. గోలేటిలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టించిన విఘ్నేశ్వరుడికి గురువారం మహిళలు పూజలు చేశారు.

కౌటాల: అన్ని గ్రామాల్లో గణపయ్యలకు గురువారం భక్తులు పూజలు చేశారు. మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆసిఫాబాద్: కాగజ్‌నగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు దృష్ట్యా జిల్లాకేంద్రంతోపాటు ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి మండలాల్లో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని డీఈ ప్రసాద్, ఏడీఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12.00 నుంచి 2.00 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

ఆశ్రమ పాఠశాలలో సౌకర్యాలపై సర్వే



విద్యార్థులతో సర్వే బృందం సభ్యులు

వాంకిడి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ అధ్యయన బృందం సభ్యులు గురువారం సందర్శించారు. పాఠశాలలో సౌకర్యాలపై సర్వే నిర్వహించారు. విద్యార్థులకు వసతులు, పీహెచ్‌సీ వైద్యులు వారికి అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అలాగే పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల, స్పోర్ట్స్ ఆఫీసర్ మీనారెడ్డి, హెచ్ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న అధికారులు, నాయకులు

జైనూర్: మండలంలోని ఉశేగాం పాఠశాలలో విద్యార్థులకు ఏటీడీవో పురుషోత్తం గురువారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సులభంగా విద్యనభ్యసించేందుకు ఒక రోజు–ఒక పదం అనే పుస్తకాన్ని అందిస్తామన్నారు. ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావు, ఎస్‌సీఆర్పీ శంకర్, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సోనేరావు, పాఠశాల హెచ్‌ఎం ఆనంద్‌రావు ఉన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన

దహెగాం: మండలంలోని చంద్రపల్లిలో కుంచవెల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ కుమార రాజా మాట్లాడుతూ పంట రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన, సురక్ష యోజన, ఎస్బీఐ జనరల్ బీమాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ దామోదర్, సీఎఫ్ఎల్ఈ రాజబాబు, ఖాతాదారులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లిలో నూతన పోచమ్మ ఆలయ నిర్మాణానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం భూమిపూజ చేశారు. వేదపండితుడు దీకొండ అశోక్ చారి, రెబ్బెన మహంకాళి అమ్మవారు ప్రధాన పూజారి దేవర వినోద్ పూజలు చేశారు. అంతకు ముందు గ్రామస్తులు భాజభజంత్రీలతో వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ ఉపాసి సంజీవ్, మాజీ సర్పంచులు సుధాకర్, పరదేశి, రాములు, గణపతి, బాయక్క, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌కు అండగా..

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ ముత్యాల రవికి తోటి ఫొటోగ్రాఫర్లు ఆర్థికంగా అండగా నిలిచారు. రవికి ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె రమ్యకు ఎంసెట్‌లో 35 వేల ర్యాంక్ వచ్చింది. హైదరాబాద్‌లోని అవంతి కళాశాలలో ఉచిత సీటు వచ్చినప్పటికీ, రవి ఆర్థిక పరిస్థితి కారణంగా రమ్య విద్యాభ్యాసం కొనసాగించలేని పరిస్థితి. విషయం తెలుసుకున్న ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు ముందుకొచ్చి నగదును విరాళాలు సేకరించి గురువారం రమ్యకు అందించారు. ఫొటోగ్రాఫర్లను పలువురు అభినందించారు.

'రోజుకొక అక్షరం' ప్రారంభం

కెరమెరి: ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాలల్లో 'లెర్న్ ఏ వర్డ్ ఏ డే' అనే వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని సాకడ, ఆంద్‌గూడ పాఠశాలల్లో ఎంపీపీ పెందోర్ మోతిరాం గురువారం ప్రారంభించారు. ఎస్సీఆర్పీలు శ్యాంరావు, నరేశ్, హెచ్‌ఎంలు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని జీడిచేనులో గురువారం రాత్రి పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, రోడ్డు భద్రతా నిబంధనలు, పోలీసు చట్టాల గురించి అవగాహన కల్పించారు. ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులపై కళాబృందం సభ్యులు పాటల రూపంలో వివరించారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. రూరల్ ఎస్సై సోనియా, కళాబృందం సభ్యులు రాజలింగం, రోహిత్, సంఘవి, శంకర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

కాగజ్‌నగర్‌రూరల్: కోయవాగులో గురువారం జాతీయ పశుధన్ జాగృతి అభియాన్ సహకారంతో కోరుట్ల పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా పశువుల్లో గర్భకోశ వ్యాధులు వాటి చికిత్స, జీవాల్లో అంటువ్యాధులు చికిత్స, నివారణ చర్యల గురించి వివరించారు. పశువైద్య యూనివర్సిటీ డాక్టర్ రఘునందన్, కోరుట్ల పశువైద్య విద్యాలయం అసోసియేట్ డాక్టర్ మాధవరావు, గైనకాలజీ ప్రొఫెసర్ అరుణ, మెడిసిన్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్ నాగరాజు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పశువైద్యాధికారులు సురేశ్ కుమార్, విజయ్ పాల్గొన్నారు.

రైతుబీమా చెక్కు అందజేత

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి గ్రామానికి చెందిన నగోషే అంజనిబాయి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, రైతుబీమా కింద మంజూరైన చెక్కును నామినీకి గురువారం జెడ్పీవైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అందించారు. సర్పంచ్ పద్మకిషన్, ఉప సర్పంచ్ సంపత్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.